# ఏకోదరులు

[కథానిక]

శ్రీ కందుకూరి లింగరాజు

"అబద్ధం ఆడితే, అల్లరిచేస్తే దేవుడు శిక్షిస్తాడని అమ్మ అంది. నీకు దెబ్బలు తగలడం కూడా అందుకే అని అంది నిజమేనా అన్నయ్యా?" —ప్రక్కగా కూర్చున్న రాజి అడిగింది.

ఏం చెప్పాలో తెలియక బాధపడ్డాడు రాజా. కట్లుల్లో ఉన్న దెబ్బలు బాధలో మూలుగుతూ, నిజమా అనే సంశయాన్ని కల్గించేయి. ఔనేమో అన్న భావన కల్గింది. పరదేశిని కొట్టేనని, వెంకన్నని తిట్టేనని దేవుడు తనకి ఇల్లాంటి శిక్ష విధించేడు అనుకున్నాడు.

"మాట్లాడవేం?"

"ఊ" తప్పిదం చేసినవాడిలాగే మూలిగేడు.

"అయితే దేవుణ్ణి ఎప్పుడైనా చూచేవా అన్నయ్యా?"

"కేశవరావుగారు చెప్పేరుగా ఆకాశం అంత పెద్దవాడని. నాకు కనుపించే లేదు"

"వాళ్ళ అమ్మాయిలకు కనుపించేడు కాబోలు. అందుకే వాళ్ళు దేవకన్యకలం మేము అని పాడేరు... ఏం అన్నయ్యా? మనం దేవతలం కాదూ?"

చెల్లెలు తల్లో ఇంకా ఇల్లాంటి ప్రశ్నలు ఎన్ని వున్నాయో అనుకున్నాడు. సమాధానం దొరకనందుకు చిరాకు కల్గింది. ఇంకేమడుగుతుందో అనుకున్నాడు...

"బాధగా వుందా? దెబ్బలు సలుపుతున్నాయా? స్కూల్లోంచి నిన్ను ఆ పరదేశి, వెంకన్న కాపు, తీసుకువచ్చేరు. డాక్టరుగారు గట్టిగానే తగిలేయే అన్నారు కూడా... కాళ్ళు పట్టనా?"

"పరదేశి తీసుకు వచ్చేడా? ఆ వెధవని నన్ను ఎవరు ముట్టుకోమన్నారు?"

"అల్లా అంటావేమన్నాయ్!" దిగాలు పడింది. పరదేశి అంటే అన్నయ్యకి ఎందుకు ఇష్టం లేదో రాజికి అర్థం కానేలేదు.

"పిసినగొట్టు..." ఆ వరసలో తిట్టేడు.

కారణం అన్నది తెలుసుకోవాలన్న కోర్కరేకెత్తినా, చంపుకునే మాటలు మార్చడానికి ప్రయత్నించింది. అవి అతకనట్టే వున్నాయి. బాధలో ముడుచుకున్న మొఖం చూస్తే జాలి కలిగింది. క్షణికం తను దాచిన కోవాబిళ్లలు జ్ఞాపకం వచ్చేయి. లేచి అలమారులోనుండి తీస్తూనే, కొంజాలోకి చూచింది. దూరంగా పరదేశి, వెంకన్న కాపు కన్పించేరు. వాళ్లు అన్నయ్యని చూడ్డానికే వస్తున్నారనుకుంది. పొట్టిలాగు, కంటి మెడచొక్కా, చిన్న గుండు క్రాపింగు, పరదేశి నడక రాజికి గుర్తే. అల్లానే క్షణికం చూస్తూ వుండిపోయింది. అతన్ని ద్వేషించేటందుకు తనకు కారణాలు కన్పించనే లేదు; మరి అన్నయ్య ఎందుకు అసహ్యించుకుంటాడు? తన కళ్లకి అందంగా ఉన్నట్టే వున్నాడు. పైగా అప్పుడప్పుడు మాట్లాడినప్పుడు చాలా చలాకీగా, మంచిగానే మాట్లాడేడు. ఇంకా మాట్లాడాలనే వుండేది, మరి...?

వెనక్కు తిరిగింది. అన్న కళ్లు తన మీదనే ప్రశ్నార్థకంగా వుండడంతో, చెప్పాలనుకుంది. లోపల భయం వెనక్కు తీసింది... వస్తూనే "నీకోసం దాచేనన్నాయ్" అంటూ చేతిలో పెట్టింది.

నెమ్మదిగానే తిండంతో, అన్నగారి ఎడ ప్రేమ ఉబికింది. నిన్ననగా తనే తింది; అన్నయ్యకి లేకుండా తను ఒక్కర్తె తింది... దానికి బాధపడింది.

అయినా ఇప్పుడు తృప్తిలోనే "బావుందా? అమ్మ చేసింది!"

తలూపేడు సంతోషంలోనే. అప్పుడు చెపుదా మనుకుంది పరదేశి, వెంకన్నా ఒస్తున్నారని. కాని చెప్పలేకనే పోయింది.

"అన్నయ్యా!" ఉలిక్కిపడి చూచేడు.

"ఎప్పుడూ నాతో జతగా వుంటావా?"

"అల్లాగే"

"చచ్చిపోయేవరకూ?"

రాజాకి ప్రేమలో దుఃఖం కల్గింది. చెల్లెల్ని దగ్గరగా తీసుకుని ముద్దెట్టుకున్నాడు. అంతకంటె అనునయం తోచనేలేదు. రాజి మెడమీద చేతులు వేసి గవద భుజంమీద ఆనింది.

"నన్ను ఎప్పుడూ రాజీఅనే పిలుస్తావ్ కాదూ అన్నయ్యా. రాజ్యలక్ష్మి అని పిలవకేం"

"అల్లాగే రాజీ!"

క్రిందనుండి తల్లి పార్వతి "అమ్మాయి... వాళ్ల పరదేశి, వెంకన్నా ఒచ్చేరే... అన్నయ్యను చూడ్డానికి..." అన్న కేక వినబడేటప్పటికి ప్రకృతిలో పడ్డారు. అన్నయ్యకళ్లల్లోకి చూస్తూనే మెట్లు దిగడం మొదలిడింది.

"పరదేశిని రానివ్వద్దే? వాడితో మాట్లాడను. చూడను" రాజా మాటలు...

"తప్పు కాదూ అన్నయ్యా. నీ కోసం ఎంత బాధ పడ్డా డనుకున్నావ్!"

ఇక మాట్లాడ లేకనే మొఖం అటు త్రిప్పి బాధలో మూలిగేడు.

వాళ్లు వచ్చేరు. వెళ్లేరు. రాజా మాట్లాడలేదు. రాజే మాట్లాడింది.

*　　*　　*

పోలవరంలో జానికిరామయ్య ప్లీడరు. అతని తండ్రి తాతలు, ఆ వూళ్లోనే పుట్టి, పెరిగి, ప్లీడరీ చేసి సంపాదనతో భూమీబుట్రా సంపాదించి, గోదావరి సమీపంలోనే శాశ్వతసమాధుల్ని పొందేరు. జానికి రామయ్య వంశప్రకారవే, అప్పులు వడ్డీవ్యాపారం చేస్తూనే వృద్ధిచేసేడు. దాంతో ఊరికి డబ్బున్న వ్యాపారస్థుల్లో ఒకరిక్రింద జమఅయ్యేడు.

పార్వతి ఆతనికి గృహలక్ష్మి అయి, మెరుగులు దిద్దింది. చాలా కాలంవరకూ పిల్లలు లేకపోవడం బెంగగా వున్నా చేసిన వ్రతాల, దేవుళ్ల ప్రసాదంగా రాజి రాజాలు వాళ్లకి వంశాభివృద్ధిగా వచ్చేరు. దీనికి ఇద్దరూ పున్నామనరకం నుండి తప్పింపబడ్డామని కువకువమనే, అతిగారాబంగా పెంచేరు. అడుగులకు మడుగులే ఒత్తేరు.

మూడు సంవత్సరాల ఎడబాటులో ఉన్న రాజా, రాజీల పెంపకం రాజాని రాలుగాయిక్రింద, రాజిని సంసారిక్రిందనే తయారుచేసింది. పుట్టుపాలతోనే, అది వాళ్ళిద్దరిలోనూ పాతుకుపోయింది.

ఒక్కొక్క వత్సరమే క్రొత్తబట్టలు, పిండివంటలు, భోగిపళ్లతోనూ వాళ్లిద్దర్నీ దగ్గరగా తీసుకొస్తూనే పెద్దవారిగా చేసింది. సంవత్సరాలు జరగడంతో రాజికి అన్నగారంటే పూజ్యభావం ఏర్పడింది. అన్నయ్య అందమైనవాడు, తెలివితేట లున్నవాడు. ఇంకెక్కడా లేడని సంతోషపడి, దేవుడి క్రిందే చేసింది. ఆతను పుస్తకాల్లోంచి చెప్పే, చదివే కథలు విని, లెక్కలు చేయడం చూచి, పెద్దవాడైన తర్వాత ఏ కలెక్టరీవో, పెద్దపోలీసో అవుతా డనుకునేది వెర్రిగా.

అన్నయ్యతో అన్నం తినడం, ఆడుకోడం, చదువు చెప్పించుకోవడం, పడుకోవడం చేస్తేనే తనకి ఓ గొప్ప పేరు వస్తుందని వెర్రిగా నమ్మేది. శాయశక్తులా కష్టపడేది. రాజుకీ రాజీ అంటే ప్రేమ లేకపోలేదు. అప్పుడప్పుడు అమ్మ గొప్పదా నాన్న గొప్పవాడా. అన్న ఆలోచనలు వచ్చేవి. ఇంట్లో అమ్మ చెప్పడం నాన్న వినడం చూస్తూనే వుండేవాడు అమ్మ గొప్పది కనుక అల్లా నాన్న చేస్తున్నాడు. అమ్మకు నేను ఎక్కువ ఇష్టం కనుక, తనుచెప్పాటకే అన్న ఊహ మిద్దెలు కట్టేది. తక్కినవాళ్ళంతా చెప్పిన పనులు చెయ్యడానికి, సేవకోసం ఉన్నారని వూహించుకొని, రాజికి పురమాయింపులు చేసేవాడు. ఈ వూహ రాజియెడ ప్రేమను ఎక్కువగా వృద్ధి

పరచలేకపోయింది. చెప్పుచేతల్లో చెల్లెల్ని కీలుబొమ్మగా చేసుకోవడమే తనకి ధ్యేయం అన్నట్టుగా వుండేవాడు.

తను చెప్పే కార్యాలను సమయాన్ని చూచి రాజీ అని రాజ్యలక్ష్మి అని ఆయుధాలు ప్రయోగించేవాడు రాజ్యలక్ష్మి అన్న ఆయుధాన్నే ఎక్కువగా ఉపయోగిస్తూ లేత హృదయాన్ని నొప్పిస్తూ వుండేవాడు.

ఇంకెవళ్ళ చేతనైనా రాజ్యలక్ష్మి అని పిలిపించుకోడానికి ఒప్పుకునేది కాని, అన్నయ్యే అల్లా పిలుస్తే తేలు కుట్టినట్టే బాధపడేది రాజీ. 'రాజీ' అని పిలిస్తే ఎవ్వరూ ఇవ్వలేనంత ఆనందాన్ని ఇచ్చినట్టుగా తృప్తి చెంది, సంతోషపడుతూనే అన్నయ్య వెనకాల తిరిగేది.

పార్వతీ జానికి రామయ్యలు కూడా తమసంతతిని చూచి మురిసి పోతూనే, వాళ్ళిద్దరి మధ్యా వచ్చే చిన్న చిన్న కలహాలను—అసలు తక్కువే అయినా, జడ్జీలై తీర్పులు చెప్పేవారు.

జానికి రామయ్యకు ప్రతిగా చెప్పాలంటే ఆవూళ్ళో గోపాలంగారు ఒక్కరే. ఆయనా ఘరానా కుటుంబంలో పుట్టి డబ్బు మస్తుగా యుండడంతో ఉద్యోగం ఎందుకని, వడ్డీవ్యాపారాన్నే కౌగలించుకుని, ఘరానామనుష్యుల్లో ఒక్కరే అయ్యేరు.

సీతమ్మకూడా, సమయాల్లో ఆదుకుంటూ, ఆయన పిసినిగొట్టుతనంకు అనుగుణ్యంగానే కానీ గోంగూర రెండు రోజులకు సరిపుచ్చి, కష్టం చేసేది ఖర్చు. ఇనప్పెట్టెలు ఆయన పుస్తెలమ్మించి నింపుతుంటే, సంసారంలో దూబరా తగ్గించి మూలిగేట్టు చేసింది. ఆయనా సింగరాజులింగరాజులాగే పింఛం విప్పుకుని కబళించడానికి, ఎరకోసం ఎదురుచూస్తూ వుండేవాడు.

ముగ్గురు నలుగురు పుట్టిపోయిన తర్వాతనే, మాధవమ్మ కాలతోనే ఆ నిలిచిన ఒక్క సంతానానికి పరదేశి అని పేరు పెట్టి పెంచేరు. వాడి పెంపుదలా పేరుకు సార్థకం అయినట్టే అయ్యింది. పెరగడమే తండ్రి రక్తంలోంచి అన్నట్టుగానే, గోపాలంగారి పిసినిగొట్టుతనం అలవాటైపోయి, ఆఖరుకు నిత్యకృత్యాల్లోనూ పొదుపు పెట్టేవాడు. ఈ పొదుపుకు గోపాలం సీతమ్మలు మురిసినా, రాజాకిమాత్రం ద్వేషంగా పరిణమించింది.

ఒక్కవయస్సుల్లో, ఒకేక్లాసుల్లో వున్నా, వాళ్ళు స్నేహం అభివృద్ధిపరచుకోలేకపోయేరు. పుస్తకాల మార్పులు అప్పుడప్పుడు జరిగినా; స్కూల్లో పిల్లలు పరదేశిఎడ చూపించే అసహ్యంతో ఆతన్ని ఏడిపించి, ఉడికించడంలో పాల్గొనేవాడు. దీనికితోడు వాడి తల్లిదండ్రులగురించి చెప్పుకునే కట్టుకథలు ప్రత్యేకంగా ఎడపరచింది. గోపాలం వాళ్ళనీ వీళ్ళనీ ఫకీర్లు చేయించేడని, సీతమ్మ బిక్షమైనా పెట్టదని, ఆస్తులు వేలాం వేయించడం, పుస్తెల్ని అమ్మించడంలో గోపాలం ఫస్టు అన్నవి రాజాని బాధపెట్టి, ఉగ్గుపాలతోనే పరదేశిని, పులిస్తరాకులా చూడ్డం అలవాటైపోయింది.

అన్నగారు ప్రతీరోజూ చెప్పే పరదేశికథలు వింటుంటే, ఆతన్ని చూడాలన్న కోర్కె రాజిలో ఎక్కువే అయ్యింది. చూపించమని కూడా అడిగింది. ఎల్లాగైనా పరదేశితో స్నేహం చెయ్యాలి, అందరూ ద్వేషిస్తే మరి ఒక్కడూ ఏడుస్తూ ఎల్లా వుంటాడన్న జాలితోనే. ఇప్పుడు చూచిన తర్వాత తన జాలిపోలేక, మిత్రత్వం అభివృద్ధి చెందడానికే ప్రారంభించింది... పైగా...

గోపాలంగారికి జానికి రామయ్య అంటే పైకి గౌరవము స్నేహము ఉన్నా, లోపల్లోపల ఆయన చవకబారులో వడ్డీ ఇయ్యడంమూలాన్న వ్యాపారం దెబ్బతగలడంతో కోపంగానే వుండేది. పైగా పోలవరంవచ్చే ఆఫీసర్లు అందరూ ఆయనఆతిథ్యం పొందడంతో ఈర్ష్య వచ్చేది. ఎప్పటికైనా సమయం దొరకక్పోదు అన్న విషం లోపల మెసలుతూనే వుంది; ఈ లోపుగానే ఎప్పుడైనా కలసినపుడు, క్రొత్తగా వియ్యంకుల సరసాలుకూడా దొర్లడంతో అది అంతర్వాహినిగానే వుండిపోయింది. జానికి రామయ్య

తన చదువు ఈ విధంగా మనుష్యులు వుంటారు అని చెప్పక పోవడంతో, గోపాలంకొడుకు పరదేశికి తన కూతుర్ని ఇస్తే బాగానే వుంటుంది అన్న భావనలోనే ఆయన్ని గౌరవ ప్రేమల్తోనే చూచేవాడు. దీనికి సరిపడ్డట్టే పార్వతికూడా, గోపాలంగారు వచ్చినపుడు 'అన్నగారు' అంటూ వియ్యంకులు అన్న భావనలోనే సపర్యలు చేసేది.

ఇల్లా రోజులు పండుగల్తో, పుట్టిన రోజుల్తో, ఒకళ్ల యింటికి ఒకళ్లు వెళ్లడం, పేరంటాలు, పబ్బాలు చేయడంతో కలిసినట్టే ఉండే జరిగేయి. వత్సరాలే వెళ్ళేయి.

* * * *

రాజు, పరదేసికూడా ఆ స్కూల్ ఫైనల్ పరీక్షకు వెళ్ళేరు. ఇద్దరూ కష్టపడే చదివేరు. వేషభాషల్లో ఎల్లా వున్నా, చదువులో పరదేశి రాజుకు ఏ మాత్రం తీసిపోనట్టే వుండేవాడు. ఆ రోజుల్లో పరీక్ష ఫలితాలు ఎప్పుడు వస్తాయా అన్న ఆతృతలో పేపరుకొరకు ఎదురు చూచేవారు.

మే నెలరావడంతో వాళ్లు ఖంగారేపడ్డారు. ఆ రోజు పేపరు రావడంతో తీర్థంలోని ప్రజల్లా, విద్యార్థులు వార్తల్ని వెతుక్కుని, ముఖకవళికల మార్పులతో, రోడ్లమీద నవ్వుతూనో, దిగాలుగా సందుల్లో నుండో దిగజారి పోయేరు. రాజు మూలావారిసందు తిరిగేటప్పటికి పరదేశి ఎదురై "నువ్వు ప్యాసయ్యేవ్" అన్నాడు.

ఒక్కసారి మేరువుపర్వతం ఎక్కినట్టే అయ్యింది. పరదేశిది ఏమైంది అని అడగాలన్న విచక్షణకూడా ఆక్షణంలో కలగలేదు. దిగాలుగా వున్న పరదేశే "సెకండ్ లిస్టు వస్తుందా ?" అన్నాడు. దాంతో వార్త తెలిసినా "సైన్సు పేపరులో తక్కువ ఒచ్చేయేమో ! వారంలోపుగా వస్తుంది..." అనే మళుపు తిరిగేడు. ఆ క్షణం పరదేశి ఇంకా ఏదో చెప్పా లనుకున్నాడు. కాని రాజు వింతప్రవర్తన కోపం తెప్పించింది. ఒక్కటి ఇద్దరికీ అన్యోన్యం ఎప్పుడూ లేనే లేదు. అల్లాంటప్పుడు ఆశించడం పొరపాటే అనుకున్నా అతకలేదు.

ఇంటికి వచ్చేటప్పటికి తల్లీతండ్రీ కూడా మొఖాల్లో సంతోషం పులుముకున్నారు. ఏం చెప్పాలో, కొడుకు తెలివితేటల్ని ఎల్లా అభినందించాలో జానికిరామయ్యకి పార్వతికి కూడా తట్టలేదు. రాజిని పిలిచే "రాజీ పరీక్ష పాసయ్యేనేవ్" అన్నాడు, లోపల నున్న సంతోషం ఆగక రాజా.

సంబరపడింది. "అయితే నాకే మిస్తావ్ ?"

"ఏ మిమ్మన్నావ్ రాజీ ?"

"ఆలోచించు"

"పరీక్ష ప్యాసయినందుకు నువ్వు నాకివ్వాలి కాని... నే నిచ్చే దేమిటి ?"

"ఆడాళ్లు మగాళ్లకు ఇస్తారేమిటి నాన్నగారూ ?" ఫిర్యాదీలా తీర్పు చెప్పమంటూ వెళ్లింది.

జానికిరామయ్య సందిగ్ధంలో పడి "వాళ్ల గోపాలంగారి అబ్బాయి దేమయ్యిందిరా ?"

"పోయింది."

ఒక్కసారి తండ్రీ, తల్లీ, రాజీ కూడా ఉండేలు దెబ్బ తిన్నట్టే అయ్యేరు. "పోయిందా" అంటూనే రాజి తేరుకుంది.

తలూపేడు. "సెకండ్ లిస్టులో రావచ్చు."

దాంతో కొంతవరకూ అందరూ తేరుకున్నారు. ఈ అవ్యాజప్రేమ పరదేశిఎడ ఎందుకు కల్గిందో అర్థం కాలేదు. తన్ని అభినందించడంకంటె, పరదేశిని పరామర్శించడంలో వాళ్లు చూపే ఆతృత న్యూనతపరచింది. ఎందుకు ? అన్న ప్రశ్నతోనే గదిలోకి వెళ్లేరు.

ఆ రోజు సాయింత్రం వెంకన్నకాపు రాజాని "ప్యాసయ్యేరుటకాదండి ?" అని బుగ్గమీసాల్లోంచి అభినందించేడు. ఇదివరకు వెంకన్నకాపు రాజాని ఎప్పుడూ పలకరించలేదు. ఎప్పుడూ రానివాడు వాళ్లింటికిరావడం వింతగానే వుంది. తనకి దెబ్బలు తగిలినపుడు వచ్చేడని రాజి చెప్పింది. అది తప్పనిసరి అన్నట్టే వుంది. వూళ్లోకి మోతుబరిలా వుంటూ, తన తండ్రి గోపాలంమీద వాడు ఉపయోగించే తిట్లు

వినసే విన్నాడు. 'వూరికి రాహుకేతువులు వెధవ బాపనాళ్లు' అనేవాడు. ఇప్పుడు ఇంత ఆపేక్ష ఎందుకు కల్గిందో, పాపిష్టిదయ్యక్రిందే వున్నట్టు కన్పించింది.

మొట్టమొదట్లో వెంకన్నకి ఆధరువు లేనే లేదుట. ఓసారి భద్రాచలం శ్రీరామనవమికి వెళ్లితే, అక్కడ కలరా తగిలి చచ్చినవాళ్లందరిదగ్గరా, నా బాబాయి, అప్ప, మేనత్త అని చెప్పి ఏడుస్తూ బంగారం సంపాదించి, ఇప్పుడు పెద్దవాడైయ్యేడు. పైగా జమిందారుతో లావాదేవీలకు దిగి వాడి అంతం కనుక్కుంటానని శంఖారవం చేస్తున్నట్లు, గోపాలం, తన తండ్రి మాటల్లో విన్నాడు. "ఎంత పనికేనా తయారైయ్యే దుర్మార్గుడు" అనే వారిమాటలు, ద్వేషం కల్గించేయి. ఇప్పుడు అర్థం కాలేని విషయం క్రిందే వుంది.

"పైకి చదువుతారా ?"

"చదవాలని ఉంది" ముభావంగానే సమాధానం ఇచ్చేడు.

"కాకినాడ బావుంటుందండి. మా మేనల్లుడు రామారావు అక్కడే చదివేడు. శెలవులకి వచ్చేడు. రాండి ఓసారి" వెండిపొన్నుకర్ర తడుముకొని వెళ్లిపోయేడు.

రాజా రామారావుని ఒకటి రెండుసార్లు చూచేడు. చీంబోతుకు వాడికి తేడా ఏమిటో తెలిసింది కాదు. ఇంట్లోకి వచ్చేడు.

కవాచీబల్లమీద కూర్చుని గోపాలంగారు సాతాళించిన శనగలు ఫలహారం చేస్తూనే "ప్యాసయ్యే వుట కాదోయ్" అన్నాడు. ఉలిక్కిపడి...'ఏదో' అన్నట్టే చిరునవ్వు నవ్వేడు.

"కాకినాడలో చేరిపిద్దామని ఉంది. ఒకణ్ణీ వుంచాలి. ఎల్లాగో వుంది...వాళ్ల నాన్నగారికి వాడినీ ప్లీడరీ చదివించాలని వుంది...ఆ ఒరవలో పార్వతి మాట్లాడేస్తోంది. ఆయనా త లూపుతున్నాడు.

రాజి కాఫీ ఫట్టుకు వచ్చింది. దాన్ని ఆ పేను కొరికిన మీసంలోనుండి చూస్తూనే 'ఏమేవు కోడలా! రోజురోజుకీ' పెద్దదాని వైపోతున్నావ్" అని నవ్వేడు.

రాజి సిగ్గుపడ్డా, రాజుకు ఆ చుట్టరికం భగ్గుమనిపించింది. పిడికిళ్లు బిగపడ్డాయి.

"అమ్మాయికి ఎన్నేళ్లు వెళతాయి"

"రేపు ఫాల్గుణశుద్ధవిదియనాటికి పదకొండూ" అని మురిపంలోనే అంది...

"అయితే మావాడికి ఈడే అన్నమాట" అంటూనే నవ్వేడు.

రాజాకి పచ్చివెలక్కాయ మ్రింగినట్టే వుంది. తన రాజిని ద్వేషించే గోపాలంకొడుక్కి ఇస్తారా ? అమ్మ నాన్నా కూడా ఆ అభిప్రాయంతోనే ఉన్నారా ? తెలియని బాధలోనే ఇంట్లోకి వెళ్లి పిచ్చుగా గదిలో తిరిగేడు. భావి ?

*　　*　　*

పదిహేనేళ్లు తల్లినీ తండ్రినీ విడిచిపెట్టలేదు. పైచదువు అన్న వంకలో, దూరంగా తను ఒక్కడే హోటళ్లల్లో తింటూ, ఒంటరిగా ఉండాలంటే బెంగే కల్గింది. రాజిని విడవడం అన్నది సమస్య అయ్యింది. అంతవరకూ ఇద్దరూ ఒకేసారి తిండి, పడక, కబుర్లు చెప్పుకోడం అలవాటైంది. హృదయం ఎడబాటు అంటేనే ఆందోళన, శూన్యత ఎక్కువగా ఆక్రమించి బాధపడ్డాడు. రాజికి కాలు కాలినట్టే వుంది.

కొన్ని క్షణాల్లో పెద్ద చదువులు చదివి, ఉద్యోగంలో వందలు సంపాదించి, కారు కొంటాడని, అందులో ఆఫీసరుగారి చెల్లెలుగా తనూ తిరగడం, నాటకాలకి సినీమాలకి వెళుతాను అన్న ఆశకల్గక పోలేదు. ఈ భావనలో తను సంవత్సరాలు వెళ్ల పుచ్చగలను అనుకున్నా, బెంగ...అన్నయ్య వెళ్లిపోతాడు...ఇంక రాజీ ! అని పిలిచేవారు లేరు... అన్న అలవాటు గుండెల స్పందనం ఎక్కువే చేసింది.

అవ్వాళ వెళ్లి పోతాడు. దిగులుగానే "అన్నయ్యా !" అంది. రాజు మూట కడుతూన్నది ఆపి పైకి చూచేడు.

"సాయింత్రానికి కాకినాడ వెళతావా ?" త లూపేడు.

"అయితే నువ్వు వెళిపోతున్నావ్ ! వచ్చేటప్పుడు నాకేం తెస్తావ్ అన్నయ్యా !"

"ఏం కావాలి నీకు రాజీ?"

"నాకా! రిబ్బన్లు, లోలక్కులు, జడలోకి పిన్నీసులు..."

"అల్లాగే! తప్పకుండా!"

"అన్నయ్యా! నేను ఒకటి ఇస్తా నీకు; ఎవరితోటీ చెప్పకుండా వుంటావా? కాకినాడలో వాటితో అవసరం ఒస్తుందేమో!"

రాజుకి అదేమిటో అంతు చిక్కలేదు. ఆగునుస్తూ, ఆ పేత్ర ఒలుకుతుంటే కరగిపోయేడు. హృదయం ఆర్ద్రపడింది.

"చెప్పనులే రాజీ!"

"ఒట్టే" మెల్లగా పరికిణీబొందులో దోపిన పూలు సంచీ తీసి, చేతులో పెట్టింది. వంపేడు. అందులో అన్నీ కానులే! మూడణాల ముక్కానీ! ఎన్ని తీర్థాలల్లో కొనుక్కోకుండా దాచిపెట్టి తనకి ఇచ్చిందో! ఎంత ప్రేమో! అని హృదయంపొంగులో దగ్గరా కౌగలించుకుని, ముద్దు పెట్టుకున్నాడు. కళ్లు ఆర్ద్రతలో తడే అయ్యేయి.

"అన్నయ్యా, నా జత ఎప్పుడూ వుంటావు కాదూ? రాజి అనే పిలుస్తావ్ కాదూ?...ఓసారి పిలు అన్నయ్యా!"

చినుకులమధ్య "రాజీ!" అనే కళ్లు తుడుచుకున్నాడు. తన చెల్లెలు...తను ఒదలలేడు...

బరువుతో...నే బండిలో ఎక్కి, లాంచిరేవుకి వెళ్లేడు. ఉద్వేగం ఆగకే బావురు మన్నాడు... అయినా అది లోపల్లోపలే..."రాజీ!" మననం చేస్తూనే రైలెక్కేడు......కాలేజీలో రోజులు జరిగేయి.

* * *

యాథాలాపంగానే గోపాలం వెంకన్న కాపు పొలంలో పొట్టిబసంగిపంట చూడ్డానికి వెళ్లి, చేను మీదనే బేరం ఇస్తున్న కాపుతో ఆకబురూ ఈ కబురూ చెపుతూనే ఊళ్లోకి వచ్చేరు. వ్యవసాయ డిపార్టుమెంటు బసంగిపంటను, దాని దిగుబడిని వెంకన్న మాట్లాడుతూనే, తను జమీందారుతో వేసిన దావాను గురించి చెప్పేడు. అందులోని లాపాయింటు, డబ్బుపెట్టుబడి, పర్యవసానం ఎల్లా వుంటుందో అన్న ఆందోళనా అన్నీ మాటల్లోకి వచ్చేయి. కబుర్లకు సరిపడ్డట్టే 'ఎంతమాట! అంత పని చేసేడుటోయ్ జమిందారు...ద్రోహం...ఈ రోజుల్లో న్యాయానికి స్థానం లేదోయ్' అన్న వాక్యాలు చెపుతూనే అడుగులు వేసే విడిపోయేరు. జానికిరామయ్య ఇంటిదగ్గర.

దారిపొడుగునా గోపాలం బుర్ర ఎత్తులు ఎత్తుతూనే వుంది. వెంకన్న చూచాయిగా చెప్పిన డబ్బునిక్కచ్చి, అప్పు అన్నది, ఎలకమీద పిల్లిని ఎల్లాగా ఎక్కించడం అన్నట్టే తిరిగేయి. లోపల్లోపల పచ్చిగా వున్న జానికిరామయ్యని ఇరికిస్తే, ఆయన పుస్తె పుటుక్కున తెంపచ్చు అన్న ఆశ మొలకలు వేసింది. ఇదే ప్రాణప్రతిష్ఠ చేయబడితే, పోలారంలో జమీందారు తనే, అన్న వూహల్తోనే జానికిరామయ్య ఇంటిమెట్లు ఎక్కేడు.

సావిట్లో కూర్చున్న జానికిరామయ్య ఈయన్ని చూచి గౌరవం చేస్తూనే, గుమ్మంలో నుంచున్న పార్వతికళ్లల్లోకి చూచి ముసిగానే నవ్వేడు—వెతకబోయిన తీగ కాళ్లకు తగిలిందన్న భావనలో.

"పొలం వెళ్లి ఒస్తున్నట్టున్నారు అన్నగారు."

తలూపుతూనే నవ్వి, "కాపుచేలోకి కూడా వెళ్లేను. పొట్టిబసంగిట ధాన్యం బాగానే దిగుబడి అయ్యింది. అయితే విన్నారా? ఆ జమీందారు హైకోర్టులో దావా వేసేడుటండి మన క్రిందికోర్టులో ఎగస్పార్టీ అవడం మూలాన్ని." ఎల్లా తీసుకుంటున్నాడో అన్న కొలుకుల్లోంచే చూచేడు.

"క్రిందికోర్టుతీర్పే ఖాయమైతే దెబ్బతోటి, కాపు జమీందారే అవుతాడు. వాడికేం అండి. ఇంకో మూడుతరాలపడి తిన్నా తరగదు ఆస్తి."

"అల్లాగానే నేను విన్నానండి భావగారు."

"సరే కాని...అబ్బాయి వుత్తరాలు వ్రాస్తున్నాడా? పాపం! ఒక్కడు. హోటల్ తిండి సరిపోతోందా?"

"వ్రాస్తూనే వున్నాడు...అయితే అన్నగారు పరదేశి ఈమధ్య అసలు కన్పించటం లేదే" అంది పార్వతి తలుపుచాటునుండే ఓ అడుగు ముందరికి వేస్తూనే "మమ్మల్ని మరచిపోయినట్టున్నాడు."

"మర్చిపోవడమా! ఎంతమాట. ఆ రామారావు స్నేహం వచ్చినప్పటినుండీ..."

"అయితే బస్తీవాడవుతున్నాడన్నమాట."

"దానికేం పులిని చూచి నక్క వాతెట్టుకుందట. ఇప్పుడు నెత్తిమీద జూలు, తురకలాగులు, కాలరు చొక్కాలుట, మేక చెవుల్లా..."

అడ్డుగా మాటకు వస్తూనే "అంత అల్లా మాట్లాడుతారు. పెళ్లి కొడుకు కాదూ? అంటూనే తర్వాత మీకంతా ఒదిలి వేసేను అన్నట్టు జానికిరామయ్య వైపు చూచింది.

అందుకున్నట్టుగా ఓవగ్గు దగ్గి, "భావగారూ, మీ ఇంటికి ఓసారి ఒద్దా మనుకుంటున్నాను" అన్నాడు.

గోపాలం ఉలిక్కిపడ్డాడు. ఇద్దరి ముఖాల్లోనూ, వెన్నపూసలాంటి చూపులు చెప్పనే చెప్పేయి. నవ్వుతూ... "ఎప్పుడూ మా ఇల్లు మీకు స్వాగతమే" అంటూనే లేచేడు. మెట్లు దిగినపుడు, ఒక్క దెబ్బలో రెండు పక్షుల్ని కొట్టినట్టే అడుగులు వేసేడు.

పార్వతీ భర్తవైపు చూచి "పని కట్టినట్టున్నాడు" అంది.

"ఉ" అంటూనే భుజాలమీద చేతులు వేస్తూ "మరి అమ్మాయిని అడిగేవా?"

చిలిపిగా చూస్తూనే "ఉ. దానికి ఇష్టమే పరదేశి అంటే"

"ఐతే మిగిలింది ఇదే" అంటూనే దగ్గరసా ఒత్తుకుని కళ్లల్లోకి నవ్వేడు. దాంతో ఆవిడా "పోదురూ" అంటూనే గవద భుజంమీద ఆన్చి క్షణికం గునిసింది.

ఆ శ్రావణంలో...

రాజా కాలేజీలో ఉండగానే, తండ్రిదగ్గర నుండి ఉత్తరం వచ్చింది. పసుపుబొట్టుల్తో ఉన్న దాన్ని చదివి తన కళ్లను నమ్మలేకపోయేడు. శెలవుల్లో ఇంటికి వెళ్లినపుడైనా చూచాయగా తల్లిదండ్రులు చెప్పనేలేదు. చిన్నతనంలో హేళనగా అనుకున్న మాటలు అంత త్వరలో మహావృక్షమైపోతుం దని నమ్మలేని స్థితిలోనే బాధపడ్డాడు.

నిజంగా రాజికి పరదేశి తగ్గ భర్తేనా? ఆమె సుఖపడుతుందా అన్న విషయాల్లో ఆవేదనతో భయపడ్డాడు. పైగా తను ఎన్నో విన్నాడు. ఇప్పుడు ఆ చిన్నతనపు పరదేశి కాదని. మారేడు...అందులో రామారావుస్నేహంతో ఎన్నివిధాలుగా మనిషి, యవ్వనంలో మారతాడో అన్నివిధాల వ్యసనాలతోనూ, అందులో జారత్వం కూడా అలవాటు పడింది. అనే వార్త విన్నప్పటినుండి శాంతి లేకపోయింది.

రాజి... ఒప్పుకుందా? ఏమవుతుంది? భావిని గురించి తను ఇంతగా ఎందుకు ఆవేదనపడుతున్నాడో కూడా తెలియలేదు...అగ్నిపర్వతంలా ఉడుకుతూ, తనలోనే భావనలు ఉంచుకునే...వెళ్లేడు...

ఆ రోజుల్లో రాజిముఖంలో వుండే సంతోషానికి ఆశ్చర్యపోయేడు. వాళ్లూ సరసంగానే పెళ్లిలో ప్రవర్తించడం చూచి, తను ఎంత మూర్ఖంగా ఆలోచనలు చేసేడో అని సిగ్గుపడ్డాడు.

ఆ వప్పగింతలనాడు 'రాజిని ఇంకొకళ్లకి ఇచ్చేసేము. పుట్టి పెరిగిన ఇల్లు దానిది కాదు...' అనే భావనతో దుఃఖం ఉబికింది. జీవితంలో ప్రతీ అన్న చెల్లెల్ని అత్తవారి చేతుల్లో పెట్టేటప్పుడు కుళ్లిపోతూ, అంతవరకు గడిపిన జీవితంలో మహానందాన్ని, ప్రేమని, అలవాటుల్ని, త్రెంచి, కారే కన్నీళ్లతో, ఝంఝూటాల్లో మలిగిన హృదయంతో, ఏడుస్తూ, ఆక్రోదిస్తూ పంపాలా? సోదరిప్రేమ, వాత్సల్యం, గౌరవం, ఒకేరక్తం పంచుకున్న ఏకోదరుల్ని. ఇల్లా విధి నియమానుసారంగా, ఆశ నిరాశల్తో, సుఖదుఃఖాలతో, విడ తీస్తుందా అనే ఉద్వేగపడి కన్నీళ్లు కార్చేడు.

రాజీ కన్నీళ్లు కక్కుకుంటూనే బండి ఎక్కింది ...వెళ్లిపోయింది...ఇంట్లో చూచేసరికి, ఏదో మహా

త్తరమైన శక్తిని పోగొట్టుకున్నట్లే అయ్యింది. శూన్యంగా, గాఢాంధకారంలా, కారుమెయిలు కప్పినట్లే ఇల్లు కనుపించితే బావురు మన్నాడు... రాజా!

* * *

రెండు వత్సరాలు గడిచేయి.

జీవితంలో వ్యసనం అనే నల్లమందు అలవాటు పడకూడదు; పడిందా అది దుంపతెంచేస్తుంది. పరదేశికి రామారావుస్నేహం నల్లమందే అయ్యింది. వయస్సులో, నోరెట్టుకు సంపాదించిన ఇంట్లోని పెత్తనం, డబ్బుని, రామారావుకోరకు, అతని ముఖస్తుతికోసం ఖర్చుపెట్టడం, జల్సా చెయ్యడంతోటి సరిపోయింది.

గోపాలం, సీతమ్మలు మొదట్లో, బాకీవాళ్ల దగ్గర ఆఖరు పైసా కూడా వసూలు చేసేడు. వాడికేం మహా జాగ్రత్త అన్న భావనలో కళ్లు మూసుకున్నారు. తన కొడుకు జాగ్రత్తయినవాడే అని మురిసిపోయేరు. రాజి మాత్రం చూచాయగా పసిగట్టిందికాని ఇదమిత్థంగా తేల్చుకోలేకపోయింది. గడచిన రోజుల్లో చిలకాగోరెంకల్లా గడిపినరాత్రులు ఈ ఇంటిదగ్గర ఆయన ఉండకపోవడంను, 'వ్యవహారాలు చూచుకుందుకు వెళ్లేరని, ఆ వ్యవహారదక్షత వచ్చేసంవత్సరం కనీసం పంచాయితీబోర్డుమెంబరునైనా చేస్తుందని' సరిపెట్టుకుని, ఒంటింట్లో, రాత్రిళ్లు ఒంటరిగా, బార్లీసుకు అనుకుని సుఖపడేది.

ఈ రోజుల్లోనే, రామారావుధర్మాన్ని, పరదేశి మిరియేల్‌కు స్నేహితుడే అయ్యేడు. మిరియేల్ ఫారస్టు ఆఫీసరుగారి కూతురు. చదువుకునే రోజుల్లో రామారావు, ఆవిడ కాకినాడలోనే ఒక్క క్లాసులోనే చదివేరుట. పరిచయం అయిన స్నేహం, తీగగా అల్లుకుని, కాయలూ పువ్వులూ పూచి, ఇక పరదేశి వాళ్లింట్లోవాడే అయ్యేడు. ఈ స్నేహం, ఒక్క గోపాలంకు ఇష్టంగానే వుంది. ఆ ఆఫీసరుగారి సహాయంతో తన కొడుకు, సర్కారు అడవుల్లో సగం తనదిగా చేసుకుంటాడు కదా అని అనుకునే ఊరుకున్నాడు. సీతమ్మకి చెప్పినపుడు మురిసిపోయి నా సాయన ఎంత తెలివైన ఎత్తులు వేస్తున్నాడో" అనుకుంది.

ఈ సంగతి వూళ్లో నలుగురి నోట్లోనూ పడి, జానికిరామయ్యకు తెలియడంతో, హృదయం బ్రద్దలే అయింది. తను రాజికి ఊహించిన సౌధం అమాంతంగా, కళ్లెదుట, దగ్ధం అయ్యేటప్పటికి దెబ్బతిన్న పక్షిలా నే గిలగిల్లాడేడు. పార్వతి కడుపుశోకం ఏడ్పిస్తుంటే, తరుక్కుపోయిన హృదయంతో కృశించింది.

రెండు మూడు సార్లు గోపాలం కాళ్లావేళ్లాపడి బ్రతిమాలినా "వాడు పెళ్లాడేడు. వాడికీ బాధ్యత తెలుసు. నీ కెందుకీ తాపత్రయ"మన్నాడు. అందులోని ఈసడింపుకు జానికిరామయ్య క్రుంగిపోయేడు.

దినాలు గడిచేసరికి రాజి సత్యం తెలుసుకుని, చేసే దేమీ లేకనే, కృశించి బడు గైంది. చిక్కి శల్యం అవుతున్న రాజిని చూచేసరికి తండ్రిప్రాణం ఊరుకోలేక "నాకు దాన్ని ఓ మొగపిల్లాడిక్రిందే పెంచుకుంటా" అని పరదేశిని అడిగేడు. "దాన్నా! తీసుకెళ్లూ. ఇక్కడ నా కేమైనా చాకిరీ చేసి ఏడుస్తోందా ఏమిటి?"అని కసిరేసే తలుపు వేసుకున్నాడు.

కుంటుపడిన హృదయంతో రాజిని తీసుకు వెళ్లేడు. తన సంతతిఉన్నతి ఈవిధంగా విధి వ్రాస్తుందంటే, చిన్నప్పుడే చంపేసివుండేవాణ్ణేమో అని ఏడ్చేడు...అయినా?

భావి! అది నిర్దయగా ఉన్నట్లే వుంది. వెంకన్నవ్యవహారం తనకి పీకలమీదదాకా వచ్చింది. ఇప్పుడు తల దూర్చినతర్వాత వెనక్కు తియ్యడం తరం కాదు...ఏ మవుతుంది?...

గోపాలం...ఎంతగా తయారయ్యేడు......తన మీద...సాటివాడిమీదనే...కత్తి దువ్వుతున్నందుకు బాధపడ్డాడు...

* * *

బి. ఏ. చదువుతున్నాడు రాజా. పరీక్షలు దగ్గరకు వచ్చేయని, పోలవరంలో ఏం జరిగిందో వ్రాస్తే మనశ్శాంతి ఉండదనే, ఉత్తరాల్లో ఏమీ వ్రాయకనే క్షేమాల్తో సరిపెట్టేడు జానికిరామయ్య. అప్పుడప్పుడు

రాజి వ్రాసే ఉత్తరాలు రాకపోవడం, రాజాని కలవరపెట్టినా, మధురతల్లో ఏ మేనల్లుడో మేనకోడలో పుడుతుందని ఊహించుకుని తృప్తిపడ్డాడు. దాంతో వెనువెంటనే చిన్నపుడు జరిగిన దృశ్యాలన్నీ ఎదురు తిరిగితే, ఆనందంలో నవ్వుకునేవాడు.

ఆ రోజుల్లో చదువులో ఈ దెబ్బతో విశ్వవిద్యాలయపు పూర్వపు రేకుల్ని పడకొట్టాలన్న ఆవేశం, ఆశతోనే పుస్తకాల్లో పడ్డాడు. తనకి ఒస్తుంది అన్న ధైర్యం ఎక్కడలేని శక్తి పోసింది. రోజులు జరుగుతున్నై.

ఆ రోజు అనుకోనేలేదు. జీవితంలో సుఖాలను, ఆశల్ని, ఉన్నతుల్ని కూడా ఇంకో మార్గానికి తీసుకు వెళ్లుతుందని. టెలిగ్రాం వచ్చింది. తన తండ్రే ఇచ్చేడు. "వెంటనే బయల్దేరి రావలెను" నమ్మకం కల్గటం లేదు. వారం రోజులైనా పరీక్షలు లేవు. అంత వెంటనే ఎందుకు రమ్మన్నారు? ఇంట్లో అంతా క్షేమమా? రాజి?...

ఊహాకు అందలేదు... ఇక జీవితం మారుతుందన్న ఊహ తడితే, ఆఖరుగా కాలేజీని చూచేడు. ఆ రాత్రే బయల్దేరేడు... దారిలో ఎన్నో భావనలు అర్థం చెప్పేయి. అయినా అవి అతకటం లేదు. ఏదో తక్కువగా, లోపించినట్టే వుండిపోయేయి.

లాంచిల్లోనే నిద్రపోయేడు... బహుశః పురుడు వచ్చింది. వెంకన్న విషయంలో భూమిపరిష్కారం అవుతుంది కాబోలు అనుకునే కలలు గన్నాడు. తన్ని తీసుకు వెళ్లడానికి రేవుకు పాలేరు ఒస్తాడు. వాణ్ణి అడుగుతా, వాడు చెపుతాడనే లాంచి దిగేడు. పాలేరు రానేలేదు. నడుం విరిగినట్లే అయ్యింది.

పొలాలు అడ్డబడ్డపుడే, ఎరుగున్నవాళ్లు, తన వైపు విచారంగా, జాలిగా, చెపుదామని చెప్పలేక ఊరుకోవడం చూచేసరికి ఖంగారు పడ్డాడు. భయం ఆవరించింది. ఇంటికి వచ్చేసరికి అంత ఇల్లూ తాళాలు పెట్టి, శీళ్లు వెయ్యడం చూచి బెంబేలు అయిపోయి, క్రుంగిపోయేడు.

"ఇల్లు ఒదిలేసేరా?" తలచుకోనివ్వటంలేదు పూర్తిని. ఎవర్ని అడగాలి?... వెనక తచ్చాటుతుంటూనే గురవయ్య "అబ్బాయిగారా! ఎంత కష్టమొచ్చిందండి. ఈ కాలంలో నిజంగా నాన్నగార్కి దెబ్బేనండి... ఎంతలో జరిగిపోయింది..." సానుభూతిగానే అన్నాడు.

అసలు సంగతేదో చెప్పకుండా ఉండడం' పెద్ద కష్టం అన్న భావనలోనే... దుఃఖం వచ్చింది. కళ్లు చెమ్మగిల్లేయి. హృదయస్పందనం ఎక్కువే అయి, డీలా అయ్యేడు.

"రేపేనండి. మూడు రోజులక్రితం జరిగింది... నిన్న స్వాధీనపరచుకున్నాడు. రేపు వేలాం వేస్తారండి... ఆ జమిందారు రాక్షసుడు కనికారం లేకుండానే... అటు వెంకన్న కాపుదీ, ఇటు జామీనున్న మీ నాన్నగారిదీ..."

అవగాహన అయ్యింది. ఆస్తి; దానికోసం మానవులు ఎంత నీచంగా తయారవుతారో బోధపడింది. జీవితంలో అదీ అనుభవమే అయినా, దిగతీసింది...

"నాన్నగారు డీలామే అయ్యేరు. బెంగతో సగం అయ్యేరండి. పడమటి కొండ్రలో వేసవి చావడిలో ఉన్నారండి" అంటూ జాలిగానే గురవయ్య కన్నీళ్లు ఒత్తుకున్నాడు.

పొలంగట్లమ్మట వెళుతుంటే ఎన్నో సాదృశ్యాలు తలంపుకు వచ్చేయి "పచ్చగా పూలు పూసిన చెట్టు ఓసారి ఎండు మ్రానైపోదూ" అన్న వేదాంతంలో తృప్తిపడుదామన్నా... తన జీవితం? భావి? అసంపూర్ణ విద్యా, భుజాలమీద ఇప్పుడుపడ్డ సంసారం, వయస్సుమళ్లిన తల్లీ తండ్రీ...ఈ స్థితికి తండ్రిని ఈడ్చిన వ్యక్తులూ, వ్యవహారాలూ...ఆఖరుగా రాజీ... ఏమవుతుంది? తను నిర్దయగా చూస్తూ తలొగ్గవలసిందేనా? మరి ప్రతీకారం?...ఎన్నో అసంపూర్తి రామాయణాలు అల్లకల్లోలం కావించేయి...

ఒక్కటే మిగిలింది...హృదయం అదే కాంక్షించింది. "తన కక్ష సాధించాలి, పగ తీర్చుకోవాలి, అందుకే జీవితాన్ని బలిపెట్టాలి" అనుకునే అడుగులు వేసేడు.

గుమ్మంమెట్లు ఎక్కుతున్నపుడే పార్వతి గొల్లుమంది. రాజికూడా వెక్కివెక్కి ఏడ్చింది. రాజి

చూడ్డానికి వచ్చిందా? ఆ ప్రశ్నకి సమాధానం ఆక్షణంలో దొరకనే లేదు. మంచంమీద శల్యావశిష్టంగా, రక్తం క్షీణించి పాలిపోయిన తండ్రిని చూచేసరికి గుండె తరుక్కుపోయింది.

జానికిరామయ్య, అంతకాలం బిగపెట్టుకున్న బాధని, ఒక్కసారే చెప్పేడు. తను ఏవిధంగా పతనం చెయ్యపడ్డాడో కన్నీళ్లతో చెపుతూనే "నాయినా! ఏతండ్రీ చెయ్యని అపచారంలో నిన్ను ఒదులుతున్నాను. నేను సంపాదించినదాంతో నీవు యువరాజులాగే జీవిస్తా వనుకున్నా. కాని దేవుడు వేరు విధంగా తలచేడు. నిజంగా నీకు తండ్రిని కాను అన్నట్టే, ఈ చిన్న వయస్సులో పెద్ద మిత్తిని తెచ్చి, నీ లేతహృదయాన్ని గాయపరచేయి ఈ చేతులు... అంతకంటే ఏమీ ఇవ్వలేకపోయేయి...

చూడు...అట్టేకాలం బ్రతుకుతానో లేదో... అమ్మ, రాజిని... నీకు ఒదిలేసి వెళ్లవలసి ఒస్తుందేమో! జీవితంలో ఓ మాధుర్యంకోసం ఎగసిపడి, అందుకోలేక క్రింద పడిపోయేను...ఆ మాధుర్యమే పెద్దపులి అయ్యింది.

వాళ్లిద్దరే మన కున్నది. రాజి...దాని జీవితాన్నంతా చేతులారా దగ్ధం చేసే ననుకుంటా. దాని సుఖం అన్నది ఎంత క్రూరంగా విచ్ఛిన్నమయ్యిందో చూస్తే కడుపు తరుక్కుపోతోంది...మీ అమ్మ...

ఆ గోపాలం..."

అంతకంటె ఎక్కువ చెప్పలేకనే ఆయాసపడి జానికిరామయ్య కళ్లు తుడుచుకున్నాడు. జాలిగా క్షమార్పణ ఉన్నట్టే అగ్నికణాల్లోంచి, వేడివేడిగా రెండు కన్నీళ్లు చిలికేయి.

రాజాకి అంతా అర్థమే అయ్యింది. ప్రతీకారం, అటు ఇటు తల్లి తండ్రి, రాజీల నిస్సహాయస్థితికి హృదయపు కోతతోనూ ఊగులాడింది భావి...

* * *

రెండురోజుల తర్వాతనే దివాను అమీనా, ఇద్దరు పోలీసులు, ఇంకో ముగ్గురు నౌకర్ల బందోబస్తుతో జానకిరామయ్య ఇల్లూ, సామానూ వేలం పాటకు సిద్ధమైయ్యేడు. దొంగమాపులతో గోపాలం బావమరదితోనూ, పరదేశి రామారావుతోనూ తయారయ్యేరు. వెంకన్న కంటికి కనుపించనేలేదు. జానికిరామయ్య కొడుకుభుజంమీద ఆనుకుంటూనే కన్నీళ్లు కుక్కుకుని, తన జీవితం ఏవిధంగా కళ్లెదురుగా అమ్ముడైపోతోందో చూడ్డానికే వచ్చేడు. అది తప్పని సరే అయ్యింది.

చేరిన పెద్దమనుష్యుల్లో చాలభాగం "పండంటి సంసారాన్కి ఎంత కష్టం వచ్చిం" దని వాపోయేరు. కాని గోపాలంపరదేశిలుమాత్రం నూత్నంగా తమ ఇంట్లోకి చేరబడే సామాన్లను ఏరుకోవడంలో మునిగిపోయి, పొంగిపోయేరు. తన పేరుమీదుగా పాట పాడిస్తే బాగోదనే, గోపాలం బావమరదికి పురమాయించి ముప్పాతికవంతుసామాను, సగం ఖరీదుకు లోపునే తనపేర కొట్టివేయించుకొన్నాడు. పరదేశి ఉన్న లైబ్రరీని, పీసంలోనే పాడి, ఆ జవ్హారిలాల్ జీవితం, గాంధీచరిత్ర, నాగేశ్వరరాయని భగవద్గీత, కాంగ్రెస్ చరిత్రల్లాంటి అమూల్యగ్రంథాలు ఇష్టమొచ్చినట్టు పంచిపెట్టి జానకిరామయ్య కుటుంబంమీద పగ తీర్చుకొన్నాడు. రాజాకి తను కాలేజీలో సంపాదించుకున్న బహుమతులు పుల్లిస్తరాకుల్లా పాడుచేయబడుతుంటే, దుఃఖం, కోపం కూడా వచ్చింది.

జానకిరామయ్యహృదయం నీరే అయ్యింది. అంతమందిలోనూ, వియ్యంకుడు, బావమరిదిచేత తను తణఖామీద డబ్బుఅడిగినపుడు లేద ని చెపుతూ, ఇప్పుడు డబ్బు విరజల్లుతూ చచ్చుగా కొనడం, పైకి నిరసనగా, హేళనగా తన వైపు చూస్తూ వుండడంతో మండిపోయింది. కోపంలో ఖూనీ చెయ్యా లన్నంత ఆవేశం వచ్చింది. కాని అసమయం అవడంమూలాన్నే లోపల్లోపలే అణచుకున్నాడు. పైగా దివాన్జీ పదిరోజులు టైము ఇవ్వకపోవుటకు కారణం కూడా ఇప్పుడు తేటతెల్లం అయ్యింది.

వెనక్కు తిరిగి చేలగట్టమ్మట వస్తుంటేనే గోపాలం "రెండుతలలపాము..." అని గొణుక్కున్నాడు జానకిరామయ్య.

ఇల్లు చేరి అలసట తీర్చుకోనే సరికే, గోపాలం రావడం చూచి, తండ్రీకొడుకు లిద్దరూకూడా ఆశ్చర్య పోయేరు. 'ఎందుకో' అన్న ప్రశ్నకంటె, చేసిన దుర్మార్గంతో సరిపెట్టక, ఈదుర్మార్గుడు, ఇంకా నక్షత్రకుడే అయ్యే డన్న కోపం వచ్చింది. జానికిరామయ్య పళ్లు పటపటా కొరకడం చూచి, పార్వతి 'ఏం పుట్టి మునుగుతుందో' అని భయపడింది; కాని జానికి రామయ్య తమాయింపు ధైర్యం ఇచ్చింది.

చెప్పులు విడుస్తూ "మా చెడ్డ కష్టం వచ్చిందండి బావగారూ. వెంకన్న కాపు అంత దగాకోరు ముండావాడని కల్లో అయినా అనుకోలేదు. వాడి ఆస్తంతా ఇదివరకే తణఖాలో వుందని తెలియనియ్యకుండా, ఎంత మాదర్చోదీపని చేసేడు... దేవుడు ఎప్పటికైనా..." అంటూనే బిక్క మొఖం వేసి, ప్రపంచకంలో జాలి, అనునయింపు ఊడిపడేట్లుగానే మాట్లాడేడు.

రాజు, పార్వతి, జానికిరామయ్యలు ముగ్గురూ కూడా తనమాట విననట్టే విముఖతతో వుండడం తల కొట్టినట్టే అయ్యింది. పైగా వాళ్ల చూపులు "ఇంకేం పనిమీద ఒచ్చేరు మహానుభావా ?" అన్నట్టుగా ఉండడం, కోడలు కూడా అదే దృష్టుల్తో వుండడంతో, తనఎడ వారి గౌరవం ఎంత వుందో కరతలామలకం అయ్యింది.

"బావగారూ ! ఈ కష్టసమయంలో మా కోడలు మీ ఇంట వుండడం ఇంకొంచం బరువు...అందులోనూ ఇప్పుడు..."సణిగేడు. జానికిరామయ్య సగంలో అందుకుని "ఏమిటీ అన్నావ్" అనడంతో బిక్కచచ్చిపోయేడు గోపాలం.

ధైర్యం తెచ్చుకునే "మా అమ్మాయిని మా ఇంటికి తీసుకువెళ్లడానికి వచ్చేను" అన్నాడు ముక్తసరిగా.

"మీ అమ్మాయి ! మీ ఇంటికివే! ముఖం పెట్టుకుని అడగడానికి వచ్చేవు? మా సంసారానికి చేసిన ఉపకారంతో మమ్మల్ని ఇల్లా ఉద్ధరించేవని, ఇంక నీకొడుకు దాన్ని ఉద్ధరిస్తాడని అడగడానికి వచ్చేవా? మొఖం ఎల్లా చెల్లిందయ్యా ! పండంటి సంసారాన్ని ముక్కలు చేసి, మా పెద్దమనిషిలా ఓదార్చుటకు వచ్చేవు...వెళ్లు...వెళ్లు. సిగ్గు లేదూ ?"

నిజంగా జానికిరామయ్య అల్లా మాట్లాడుతాడని గోపాలం అనుకోలేదు. అంతగా తన్ని అసహ్యించుకుంటున్నా డనేటప్పటికి 'అహం' దెబ్బతిని "అయితే, మా కోడల్ని పంపనంటారా ?"

"ముమ్మాటికి పంపను."

"పంపరూ ?"

"పంపను."

"అయితే దాని పని నేను కోర్టులోనే చూచుకుంటాను" అన్నాడు ఉద్వేగంలో.

"కోర్టులో చూస్తావేం...గాడిదికొడకా...... నాకు చేసిన..." తడబడే పాదాల్తో, కోపంతో ఒణికిపోతూనే, గోపాలంమీదికి వచ్చేడు. రావడంలో నీరసంవల్ల అలసిన ప్రాణం ఉండలేకనే పడిపోయేడు. మంచంకోడు గట్టిగానే తగిలింది...

దాంతో అంతా ఖంగారు పడ్డా... గోపాలం మాత్రం వెనక్కు తిరగకనే, జోళ్లు తొడుక్కుని వెళ్లిపోయేడు. ఆ రోజుమొదలు జానికిరామయ్య మంచం దిగనేలేదు. కలవరింతల్లో జీవితం గడచింది. పార్వతి తన మెడలో వున్న కాసుల పేరు అమ్మి, చెయ్యతగ్గ వైద్యసహాయం చేయించినా విఫలమే అయ్యింది.

కొద్ది రోజులు. రెండువారాలు... కళ్లమ్మట నీళ్లుకుక్కుకుంటూనే, రాజినిచూస్తూ... చూస్తూనే... కళ్లు మూసేడు.

* * *

సంసారంకు గుండెకాయ వెళ్లిపోయింది.

క్రూరంగా, మిథ్యల్తో వున్న భావికోసం రాజి, రాజా, పార్వతులు నిలబడ్డారు.

కర్మ అనేది ఇల్లావుంటే, ఇక వంశపారంపర్యా వదిలిన కత్తి రాజాకి తోకచుక్క అయ్యింది.

* * *

రాజాను గత రెండుసంవత్సరాల్లోనూ చూచిన వారు, ఇప్పటివానిని చూస్తే, ఎవరూ ఆతనే అనుకోరు. అప్పటి నవ్వుకళ పోయి పట్టుదల వచ్చింది. మితంగా ఒకటిరెండుమాటలు తప్ప ఎవరితోనూ, ఆఖరుకు రాజితో,తల్లితో కూడా మాట్లాడడం లేదు. గంభీరంగా ఏదో ఓ నిర్ణీతకార్యానికే తను బ్రతుకుతున్నా నన్నట్లుగానే ఉండిపోయేడు. కోమటి గురవయ్యదగ్గర నెలకి పదిహేనురూపాయిల జీతంమీద కుదిరి, పైగా ఒకటిరెండు ప్రయివేట్లు కూడా చెప్పడం మొదలు పెట్టేడు. ఆ మొదటి రోజుల్లో,తండ్రిపోయినతర్వాత, తను పునః చదువు కొనసాగించడానికి వీలవుతుందేమో అనుకున్నాడు. కాని వచ్చే చిన్నమొత్తం సంసారానికే సరిపోకుండా వుండడంతో, చిన్న గుమాస్తాగిరీకే తయారై పోయేడు.

నెలనెలకీ తను కష్టపడ్డ శ్రమకు వచ్చిన డబ్బునూ, బహు క్లుప్తంగా కొంతభాగాన్నే వాడుతూ మిగిలింది పెట్టెలో పెట్టి భావిలో ఎల్లాగైనా, వెంకన్నని గోపాలాన్ని ఉచ్చుల్లో ఇరికించటానికి పనికి వస్తుందనే పిపాసతో తాళం వేసి మొల్లో కట్టుకు నేవాడు.

ఇదివరకు వేసిన శిల్కు, పాపలైన్ అన్నీ ఒదిలేసేడు. విజయనగరంలో తను కొన్న చేతిచరఖా ఒక్కటే, తీరుబడి సమయాల్లో ఆతనికి, అటు జీవచ్ఛవి పార్వతికి, దగ్ధహృదయ రాజికి శరణ్యం అయ్యింది. దాంతో పైనో అంగవస్త్రం, క్రిందో అంగవస్త్రం, ఎప్పుడైనా ఓ బనీనుతోటే కాలం గడిపేడు. రాజీని చూచి మొట్టమొదట్లో పార్వతి బెంగపడింది. కాని సంసారంను పునరుద్ధరణ చెయ్యాలన్న ఆతని దీక్ష సఫలీకృతం కావాలని నెమ్మదిగానే జాలి, ప్రేమల్లో కన్నీళ్లు తుడుచుకునేది.

అన్నగారు అల్లా ఉండడం రాజికి చాలా కష్టంగానే వుంది. మొదట్లో తన పగిలిన హృదయాన్ని అనునయింపు చేస్తాడని ఆశించింది. ఎప్పుడైనా 'రాజీ!'అని పిలిచి చిన్నప్పటి మాధుర్యంతో కవుర్లు చెప్పి, ఓదారుస్తాడు అనుకుంది. కాని రాజా మారనేమారేడు. దీంతో అటు అత్తగారి ఆదరణ, ఇటు భాతృప్రేమ, భర్తనిరాదరణ, అమ్మశోకం, అన్నిట్లకీ తలోమాదిరిగానూ దూరమైపోవడంతో, ఒంటరిగా ఉండలేక, దేన్నో కాంక్షించేది. వెతపడేది. ఒకొక్కసారి 'తను అత్తగారింటికి వెళితే'...అనుకున్నా "భర్త కిరస్తానీదానితో..."అన్న భావన దేవదానవుల సముద్రమథనమే చేసింది.

ఆరోజు మామూలుగానే గురవయ్యకొట్టుకు వెళ్లేడు. గురవయ్య ఇటు ఆశ్చర్యంలో తిరుగుతూనే "విన్నారా అబ్బాయిగారూ"అని శరీరం అంతటితోటీ ప్రశ్నించేడు.

"ఏమిటి ?"

"మీ బావగారు ఆ మిరయేల్ తో లేచిపోయాట్ట...ఇంట్లో నగదు కూడా..."

ఒక్కసారి ఆశ్చర్యం వుమిలినా, వెనువెంటే దుఃఖం ఓప్రక్క, సంతోషం మరోఎడ ఆక్రమించుకుంది. "మంచి పని జరిగిందిలే" అన్నాడు.

ఈ మాటలు గురవయ్యని ఆశ్చర్యపరచేయి. స్వంత బావమరిదే ఇల్లా అనడంతో 'ఏం అల్లా అన్నారు' అన్నట్టే చూచేడు.

"గురవయ్యా! నక్క కడుపున నక్కే పుడుతుంది. కృతఘ్నుడి కడుపున కృతఘ్నుడే పుడతాడు. దానికి విచారించడం ఎందుకోయ్ !" గురవయ్యకి ఈ వేదాంతం అర్థం కాలేదు.

భావికి మంచి సూచనలు కన్పించినా, రాజి జీవితం అధఃపాతాళానికి కృంగి, గాలిలో అల్లాడే దూదిపింజ అయినందుకు ఆరాటనతోటే, సాయంత్రం వరకూ కేంద్రీకృతి లేకుండానే పని చేసి ఇంటికి వచ్చేడు.

కాళ్లు కడుక్కుంటున్నపుడే పార్వతి "రాజా! వాళ్ల సీతమ్మ వచ్చిందిరా ?"అంది.

"ఏ సీతమ్మా."

"రాజి అత్తగారు."

"ఎందుకు వచ్చిందేమిటి?" ఈసడింపు ఉండనే ఉంది.

"పెద్దదై పోతోందని, వంట్లో జవసత్తువలు తగ్గే యని, ఇంట్లో ఇంకో ఆడదక్షత లేకపోవడంవల్ల, రాజి చూచుకోకపోతే ఇంకెవరు చూస్తారని నానా విధాల చెప్పుకుని ఏడ్చిందిరా."

"పంపమందా ?"

"కళ్ల నీళ్లతోటే అడిగింది."

"అయితే నీ ఇష్టం"

"అది కాదురా! ఒక్కర్తె ఆడపిల్ల...అది కొంస్త సుఖపడుతుందేమో అని" కళ్లు తుడుచుకుం టూనే అంది.

"నీకు ఇష్టంగా వుంటే పంపు...నన్ను అడ గడం ఎందుకు ?"

"అల్లా అంటే సరా...నువ్వు ఓసారి రేపు వెళ్లి..."

సగంలో అందుకుంటూనే "నేనా! ఏముఖం పెట్టు కుని వెళ్లమన్నావ్ ? నాన్నని నిలువునా స్మశానా నికి ఈడ్చిన ఈరాక్షసుడి ఇంటికి వెళ్లి 'మా చెల్లెల్ని తీసుకువచ్చేను, ఏలుకోండి' అని ఎల్లా చెప్పమన్నావ్? చచ్చిపోయేటప్పుడు నాన్న ఏమని ఏడుస్తూ చచ్చేడో జ్ఞాపకం లేదూ? నీకు తెలియలేదన్నమాట. బ్రతికినన్నాళ్లూ రాని సీతమ్మ ఇప్పుడు ఎందుకు ఏడుస్తూ అడగడానికి వచ్చిందో. వాళ్లబ్బాయి ఆ కిర స్తానీదాన్ని లేవదీసుకుపోయేడు. ఈ వార్త మీ చెవుల్ని పడితే అసలు పంపరేమో అని ముందుగా వచ్చింది. పంపమని. కావలిస్తే ఇంకొకసారి ఏడు స్తుంది కూడాను. ఏం అమ్మా! రాజిని ఆ కిరస్తానీ దానికూడు తింటూ, భర్తకి సపర్యలు చేస్తూ సుఖపడు తుందని పంపమన్నావా? సవతికాళ్లు పడుతూ, వంట లక్కలా, దాసీదానిలా ఉండి ఆనందిస్తుందని పంపమన్నావా?" రాజు తెలియని ఉద్రేకంలోనే అన్నాడు.

పార్వతి వెన్నువిరిగినట్టే ఆ వార్త తీసింది. ప్రపంచం అంతా ఇంత విమలిప్తమై వుందా? కడుపు శోకంలో, నడివయస్సురాజీ జీవచ్ఛవం చేయబడ్డంతో బావురుమనిపోయింది.

గోదావరికి నీళ్లకు వెళ్లి తిరిగి వస్తున్న రాజి తల్లి దుఃఖం గజిబిజిచేసినా అది నిత్యకృత్యమే అవడంవల్ల అంతగా పాటించకనే అన్నగారితో 'నీళ్లు పోసుకో, మని చెప్పింది.

ఆ క్షణంలో రాజిని చూస్తే రాజుకు ఆవేదన కల్గినా, దుఃఖం వుమిలినా, పగ మాత్రం గోపాలం ఎడ ఎక్కువనే అయ్యింది. ఏం చేస్తున్నాడో కూడా తెలియనే లేదు.

"రాజీ!"

అన్నగారు ఎన్నాళ్లకి పిలిచేడు అని సంతోషపడి పోయింది. జీవితాన్ని ఎన్ని దుఃఖాలు ఆవరించినా, ఆనోటి పిలుపు అమృతమే.

"నీకు ఇచ్చిన భగవద్గీత పట్టుకురా అమ్మా"

ఎందుకో అని అనుకున్నా. ఆ క్షణంలో ఆవ రించిన ఆనందం మైకం కమ్మింది. తెచ్చింది.

"రాజీ! నిన్నొకటి అడుగుతాను. భగవద్గీ తతో ప్రమాణం చేస్తావా ?"

అన్నగారు తెలివితక్కువగా ఏ విషయంలోనూ ప్రవర్తించడని తెలుసు. అయినా ఆత్రుత మెరసింది. త లూపుతూనే "అల్లాగే"

"భగవద్గీత ముట్టుకుని...ఈరోజు మొదలు నేను గోపాలంఇంటికి వెళ్లను. ఆఖరుకు పరదేశితో అయినా మాట్లాడను...వాగ్దానం చెయ్యి."

అందులో ఎంత క్రూరం ఇమిడివుందో అని ఒణికిపోయింది. పార్వతీ కొడుకు ఎంత భీకరంగా తయారవుతున్నాడో అని కుమిలింది.

"చెయ్యి రాజీ!"

రాజికి ఇతరమార్గం ఏమీ లేనట్టే వుంది.

"నాన్నగారి ప్రాణం నిలువునా తీసేరు వాళ్లు. తెలియదూ? నీ మామ మన ఆస్తినంతా కలుపుకుని రాక్షసుడే అయ్యేడు. నీభర్త కిరస్తానీదాన్ని పెళ్లే చేసుకుంటాడు. ఇల్లాంటివాళ్లమీద మమకారం ఒద ల్లేదు? నాన్నగారు ఏడుస్తుంటే..."

కుమిలిపోయే మధ్యలో వినలేకనే "చేస్తాను అన్నాయ్" అని కేకేసింది.

ప్రపంచకంలో స్త్రీయే దుఃఖం మొయ్యాలని దేవుడు వ్రాసిపెట్టేడా? తన జీవితంలో ఆ గతించిన చిన్నతనం, సంసారంలోని మొదటి రెండువత్సరాలే సుఖాంశపు చిహ్నాలు. తర్వాత పరిస్థితులు తన్ని దుఃఖదేవతచేతుల్లో పెట్టేయి. ఇంకా నష్యత్వం ఆశించుకున్నా అది రాదు. దూరం అయ్యింది. ఇల్లాంటి బ్రతుకులో ఎందుకు జీవించడం అని చాలాసార్లు అనుకుంది...అన్నగారే ఎదురుతిరిగితే...

ప్రమాణం చేసింది కన్నీళ్లు కారుతుంటేనే— ఇప్పుడున్న స్థితికంటె ఇంకో ఏ నీచస్థితీ రాదు. వచ్చినా భరించగలదు అన్న విరక్తిలోనే.

"మాట తప్పితే......ఇక నీకు జీవితంలో అన్నయ్యగడప త్రొక్కడానికి హక్కు లేదు రాజీ" అంటూనే లోపలికి వెళ్లేడు.

తల్లీకూతుళ్లు ఒకళ్ల కౌగిట్లో ఒకరు ఏడ్చేరు— స్త్రీగా సృష్టించడమే భగవంతుడు ఎన్నో పాపాలు చేస్తేకాని చెయ్యడని.

*   *   *

ఎగుడుదిగుడుల రోజుల్తోనే జానికిరామయ్య సంవత్సరీకం వచ్చేసింది. పైరుగాలి పెనుగాలిక్రిందే అయ్యింది.

ఆరోజుల్లో రాజా తను పొదుపుపెట్టే డబ్బుకు పార్వతి, ఇంకెవ్వరున్నారు అని ఇచ్చిన బంగారాన్ని అమ్మి జతచేసి, చిన్న-చిన్న అప్పు లిస్తూ, నోటులు వ్రాయించుకుని వసూళ్లు చేస్తూనే, చెరువుల్లో కొద్ది నీరును వర్షంకురిసిన తర్వాతలాగే చేసేడు.

అంత త్వరలో రాజా వడ్డీవ్యాపారంకు మదుపు పెట్టగలుగుతాడని ఎవరూ అనకోలేదు. తెలిసి ఆశ్చర్య పడ్డారు. కోమటి గురవయ్య శిక్షణ, తండ్రి గడుసుతనం, తన వ్యవహారదక్షత ఉన్నచదువు కలిపి, ఆతను మనుష్యుల్ని ఎల్లా రాబట్టుకోవాలో తెలిసినట్టే వుండే వాడు. గోపాలంకు ఇది ప్రక్కలో బల్లెంలాగే వుంది.

పైగా పరదేశి దగాచేసి పోయేడు. వార్ధక్యంలో చెయ్యి ఆసరా పూర్తిగా పోయినందువల్ల, వ్యవహారం స్తబ్ధే అయ్యింది. ఇనప్పెట్టి తెరచేటప్పటికి గుండె గుభేలుమనేది. పూర్తిగా వ్యాపారం మానెయ్యవలసి వచ్చినా, జానికిరామయ్యకొడుకు పూనడం, అరికాళ్లక్రింద మంటలుగానే వుంది. పరదేశి క్రైస్తవమతం పుచ్చుకున్నాడని చూచాయగా విన్నాడు. పైగా వాడి మూలాన్ని వీథిలో తిరుగుటకే తలవంపు అయ్యింది.

ఆ రోజుల్లో గోపాలం లేకపోవడంతో, రాజా విజృంభించేడు. డబ్బు కాబూలీవాడిలాగే అప్పు ఇవ్వడం, వసూళ్లు చెయ్యడంతో కొంతమంది విరోధుల్ని ఏర్పరుచుకున్నాడు కూడాను. ఇక ఆ పిపాస నిర్మొఖమాటంగా జప్తులు చేయించడంతో కోర్టుపక్షే అయ్యేడు. ఇల్లా ఉచ్చుల్లో తగిలినవాళ్లు, గోపాలం మద్దత్తుతో, ఏ సమయమందైనా దెబ్బతియ్యాలనుకున్నవారు లేకపోలేదు. ప్రత్యేకంగా కాపుది చేనుమీదనే జప్తు చేయించి, ఒక్క గింజ, ఆఖరుకు గడ్డయినా లేకుండా, వేలాం వేయించడంతో వాడు పగే పట్టేడు. తండ్రికి చెడబుట్టేడని అనుకున్నా, ఊరుఊరంతా కోడై కూసినా, రాజా తను చేసిన ఈ జప్తులో, గోపాలం, కుడి భుజమైన కాపుని వంచడంతో, చెంపపెట్టే అనుకుని గర్వపడ్డాడు. ఆ రోజుల్లో తండ్రిసామాను ఏమేమి పోయిందో, అవ్వంతా కొనడం ప్రారంభించేడు. దీనికి పార్వతి, రాజి ఓ ఎడ సంతోషించినా, విన్నమాటలు విని భయపడ్డారు.

కావ్యూరు ఆరోజు దివాను దగ్గరకి రాజావెళ్లేడు' తల్లీ చెల్లెళ్లకు ఎందుకు వెళుతున్నాడో తెలుసు. తండ్రిగారు అమ్మిన ఇల్లు జమీందారు అమ్మేస్తే కొనుక్కుందామన్న ఉద్దేశ్యంతోనే వెళ్లేడు. ఆ మాటల్లో సాటివాడు కనుక దివాను, తనకి చెయ్యతగ్గ సహాయం చేస్తానని వాగ్దానం ఇవ్వడంతో, తండ్రి ఆత్మకు శాంతి చేకూరుతుంది అనుకునే సంతోషంలో, ఈ వార్త అమ్మకి, రాజికి చెప్పాలని వెనక్కు తిరిగి, త్వరగానే వచ్చేడు. ఎప్పుడు చెబుదామన్నంత ఆతృతలో హృదయం ఆయత్తపడింది.

సగందారిలోనే గురవయ్యఎదురై "అబ్బాయిగారూ ఎంత పని జరిగింది...మీ బావగారికి చాలా పెద్ద

దెబ్బ తగిలిందండి. వస్తుంటే గుఱ్ఱబ్బండి తల క్రింది లైందట...అమ్మాయిగారు ఏడుస్తూనే గోపాలంగా రింటికి వచ్చేరండి...నేనే పరిగెత్తుకుని వెళ్లి అమ్మ గారితో చెప్పేను..." జాలిపడి ఆతృత తీర్చు కున్నాడు.

రాజి వెళ్లిందా ? ఒక్కసారిగా ఒళ్లు కుతకుత మంది. తను అప్పటివరకూ ఎంత సంతోషంలో వున్నాడో, అదంతా తుంపుల్లే అయ్యింది...మాట్లాడ కనే అడుగులు వేసేడు. ఈ మనిషి ప్రవృత్తి ఏమిటా అనుకునే గురవయ్య దిగనారిపోయేడు.

దారిపొడుగునా "రాజి వాగ్దానం నిల్పుకోలేక పోయింది. వంశానికి కళంకం. తండ్రికి అపచారం... తన్ను ఓ మూఢుడి క్రింద జమ చేసింది..."అవే ఆలో చనలు. అంకుశాలు. గుమ్మం ఎక్కుతూనే "అమ్మా! రాజి ఏదే!" గంభీరంగానే అన్నాడు.

పార్వతి గాబరాలో ఒణికింది. మాట్లాడలేక పోయి కళ్లుమాత్రం వప్పగించింది. చొప్పకట్ల తలుపు చప్పుడవడంతో వెనక్కు తిరిగేడు...రాజి...తల్లి ప్రాణం "తల్లీ ఓ పదినిముషాలముందైనా రాలేక పోయేవా ?"అని ఏడ్చింది.

"ఎక్కడికి వెళ్లేరు రాజ్యలక్ష్మమ్మగారూ ?" తన్ని పూర్తిపేరుతో పిలవడం ముందు రాబోయే తుఫాన్నే చెప్పింది. దెబ్బతగిలినవాళ్లకే దెబ్బలు తగులుతాయి అనుకునే మాట్లాడలేకపోయింది. ఆ క్షణంలో ఏం చెప్పాలి ? ఎల్లా చెప్పాలి? తెలియనే లేదు.

"ఎందుకు వచ్చేరు తిరిగి? అక్కడనే ఉండలేక పోయారా ? నాన్నగార్ని చంపిన ఆ రాక్షసకొంప లోనే ఉండి, నువ్వు ఓ విసురు విసరలేకపోయావా ? చూడ్డానికి వచ్చేవా ? వెళ్లు. ఈ రోజు మొదలు నీకు ప్రపంచంకంలో ఓ తండ్రీ చచ్చేడు, దానితో ఓ అన్నయ్యా చచ్చేడనుకో......మీ అత్తగారింటికి వెళ్లండి రాజ్యలక్ష్మమ్మగారూ."

మగాడుగా జన్మించినందువల్లే హృదయాలు ఎంత క్రూరంగా, పరిస్థితుల విచక్షణలు లేకుండా తయారవుతాయో రాజి గ్రహించింది. నిజంగా, తను కష్టపడ్డా, చచ్చినా, తాళికట్టినందుకు కృతజ్ఞత కాదు, ఋణం అక్కడే తీర్చుకోవాలి; కాని విభిన్న పరిస్థితులు తన గతినే మార్చేయి. ప్రతీ గ్రహం దాని దశ అన్నట్టే నూత్న అధోగతులకే దారి తీస్తూంది జీవితం...ఏ నక్షత్రంలో పుట్టిందో...నవ్వు, ఏడుపు గూడా వచ్చేయి...

పార్వతి మాట్లాడలేక గుడ్లమ్మట నీళ్లు కుక్కు కుంది. అణగి మణిగిన జీవితమే, జీవచ్ఛవంగానే గడుపుతోంది. తన కళ్లెదుటగా తన పూర్వజన్మఫలం అనుభవిస్తోంది.

"ఇంతేనా?" హృదయంల్లోంచే దీనంగా రాజి. "ఇంకేముంది...వెళ్లు...వాళ్ల ఇల్లే నీ ఇల్లు...ఇక నా యింటికి రాకు...ఋణం తీరిపోయిందే అనుకో..."

ఆ వాక్యంకు పార్వతి బావురుమనిపోయింది. కన్నీళ్లు కారుతుంటేనే "అన్నయ్యా ! వెళుతున్నా... నువ్వు మర్చిపోయినా నేను నిన్ను మర్చిపోలేను. వెళతా...ఒక్కసారి......ఆఖరిసారిగానే అడుగు తున్నా......రాజీ అని నోరారగా పిలవ్వూ... అంతకంటె ఏమీ అడగనేలేను..."

"నేనాండి రాజ్యలక్షమ్మగారూ...పిల్వడం... వెళ్లండి...అంత ముద్దుగా పిలిచేవాడు మీ ఆయన వున్నాడు లే..."

ఎంత వెర్రిగా ఆశించిందో, అంతగాను నడుం విరిగిపోయింది. నడచింది. తను బ్రతికివుందా ? చచ్చి పోయే నడుస్తోందా ? వెనకాల పుట్టిల్లు దూరం అయి పోయింది. జీవితంలో రాదు, లేదు. ఆశ క్షణికం అన్నయ్య పిలుస్తాడేమో అని...వెనక్కు చూచింది. లేదు...గుండెలు గోలెట్టేయి...వుక్కిరైయ్యే దుఃఖం తోనే అడుగులు వేసింది.

* * *

ఆ రెండునెలల్లోనూ రాజు పరదేశిని నాల్గైదు సార్లు చూచేడు. మొఖంమీద దెబ్బలమచ్చలతోనూ, నీరసించిన శరీరంతోనే చూచేడు. పలకరించాలి

అన్న జిజ్ఞాసనే చంపుకున్నాడు. అప్పుడప్పుడు, గురవయ్యమాటల్లో 'ఇప్పుడు కాస్తకుదుటపడ్డాడు' అని విన్నా, రామారావుస్నేహం ఒదులుకోకపోవడంతో, ఏరోజుకైనా, ఆ గతించిన ఛాయలు పోవన్న భావన లోనే ఉండిపోయేడు. ఏ ప్రశాంతసమయంలోనో, రాత్రిళ్లు, ఆ చిన్నతనపు రాజితో తన జీవితం జ్ఞాపకం వచ్చినా తండ్రి చచ్చిపోతూ ఒప్పగించిన పగ, ప్రతీకారము వాటిని పెంపొందించలేకపోయింది. రాజిని చూడనేలేదు.

పార్వతి ఆరోజుమొదలు లోపల్లోపలే కృశించి పోయింది. ఒక్క కడుపున బుట్టినా అన్నా, చెల్లెళ్ల జీవితాలు ఎంత విరుద్ధంగా తయారైయ్యేయో చూచి వాపోయింది. కర్మ అనే సిద్ధాంతాన్ని ముడివేసుకుని ఓదార్పు చెప్పుకున్నా, "వాళ్లిద్దరూ కలుస్తారా!" అన్న కడుపుతీపి ఒదలలేకపోయింది. ఇంట్లో పనుల వల్ల తీరుబడి లేకనే పార్వతి రాజిని చూడ్డానికైనా వెళ్లలేకపోయింది.

ఆ దాళవాపంటలకోతల్లో రాజుకు ఊపిరిసల పనేలేదు. ప్రథమపంటలోని బాకీలకు, జప్తుసమనులకు కోర్టులకు తిరగడం, అమీనాని పిలిపించడం, వేలాం వేసి, సంతోషంపడుతూనే, తండ్రిమీద ఈ ప్రపంచకం చేసిన కృతఘ్నత తీర్చుకున్నాడు. ఆ హడా విడిలూ అవగానే, ఉన్న డబ్బు లెఖ్ఖచూచుకుని, తన ఇల్లు కొనడానికే, దివాణ్ దగ్గరకి వెళ్లేడు. తల్లితో ఈ సంగతి చెప్పినపుడు ఆమె సగం జీవం వచ్చినట్లే అయ్యింది...

ఆరోజు సంతోషం పట్టలేకనే, రాజికి కబురు పంపించి "మీ అన్నాయి కొవ్వూరు వెళ్లేడు, రేపటికి గాని రాడని" ఆ మాతృస్థానం కళ్లు కాయలు కాచి నట్టే రోదించి, ఎదురు చూచింది. ప్రతీసారి చొప్ప కట్టతలుపు చప్పుడైనపుడల్లా, 'రాజి'వచ్చిందనే వెళ్లి చూచింది. ఎప్పుడు, ఎప్పుడు అన్న ఆ హృదయపు ఆక్రందనలో, అంత దూరంలో రాజిని చూడగానే, పరుగెత్తుకువెళ్లి కౌగలించేసుకుని ఏడ్చేసింది. అందు లోని వియోగసంయోగానికి పాలు చే పొచ్చి, హృద యానికి హత్తుకునే కరగిపోయింది.

"అమ్మా! అమ్మా!" అంటూ రుద్ధంలో రాజి పిలుపు వినేసరికి, ఇంక ప్రపంచకంలో తనకి ఏమీ అక్కరలేదు. ఆ క్షణంలో భగవంతుడు మృత్యువుని ప్రసాదిస్తే చాలని అనుకుంది. పొదివి పట్టుకునే ఇంట్లోకి తీసుకు వచ్చింది.

మధ్యలో 'చిక్కిపోయేవ్! మీ అత్తగారు ఏమంది? ఆయన సరిగ్గా వున్నారా?' అటువంటి ప్రశ్నల్లోనే, అన్నగారు ఆ ఇల్లు కొండానికే వెళ్లే డన్న వార్త చెప్పింది. ఆరాత్రి రాజికి ఎంతో ఇష్ట మనే వంకాయకూర వండింది. సగ్గుబియ్యపు వడి యాలు వేయించింది. తన చేత్తోనే పెట్టి రాజి ఇంకా ఎడపిల్ల అన్న భావనలోనే సంతోషించింది. నిజంగా పార్వతి జీవితంలో కాందిశీకే అయ్యింది. ప్రియంగా ప్రేమించేవాళ్లు కరువే అయిపోయేరు...ఇప్పుడో అన్నం రొట్టె ఇస్తే, దూరంగా పోయి, ఒకరు దొంగిలిస్తారు అన్న భయంతోనే తినేందుకు ప్రారం భించినట్లే అయ్యింది.

ఆ రాత్రి తన ప్రక్కనే పడుకోబెట్టుకుంది. అనుకోకుండానే, విప్పారిన ఆకాశంలో ఫెళఫెళ మంటూ ప్రళయం వచ్చినట్లే రాజు వచ్చేడు. తలుపు పిలిచేసరికి, పార్వతి హడలిపోయింది. త్వరత్వరగానే కునుకుపడుతున్న రాజిని లేపి, వంటింట్లో చాప పరచి, పడుకోబెట్టి, తలుపు గొళ్లెం వేసి, వీథిద్వారం తెరచింది.

"దివాణ్ మద్రాస్ వెళ్లేడుట. జమిందారుతో మాట్లాడేను...రెండు రోజులు వెళ్లినతర్వాత..."అని మంచంమీద నడుం వాల్చేడు.

వంటింటివైపు భయంలో చూస్తూనే, అక్కడే మేను వాల్చి, రాజిని ఎల్లా తప్పించడమా అన్న ఆలో చనలో పార్వతీ, అటు అన్నగారిమొఖం కనీసం ఓసారి చూడాలి, చూడగలనా అన్న భాతృ ప్రేమలో రాజీ...ఆలోచిస్తూనే కునుకు తీసేరు... ముగ్గుర్నీ మైకం ఆవరించేసింది...

రాజు కొవ్వూరినుండి తిరిగి వచ్చేడు, ఇంకెవ రికి ఎసరు పెట్టడానికి అన్న విషపుచూపుల్లోనే,

ఆరాత్రే దెబ్బతిన్న పాములన్నీ తలలు ఎత్తేయి. చాటుగా వెంకన్న వెళ్లి గోపాలంను సలహా అడిగేడు. ఆయనా తలూపేడు. అంతే! ఒక్కొక్కళ్లు తిండి లేకుండా చేసినందుకు, స్థలాలూ, పెళ్లాల పుస్తెలూ అమ్మించినందుకు రొమ్ములు కుతకుతలాడుతుంటే, కడుపుమంటల్తోనే, అర్ధరాత్రి బయలుదేరేరు...

గడ్డిబొద్దు మాత్రం వెలిగింది చీకట్లో...

ఒక్కసారే గాలి వియ్యడంవల్ల, దుబ్బుగడ్డి ఇల్లు నలుమూలలా క్రమ్ముకుపోయింది. మెళుకువ వచ్చేసరికి రాజుకు దారీ తెన్నూ తెలియనేలేదు. పార్వతిమాత్రం 'వంటిల్లు'అనే అనగలిగి, సందుగా పెట్టి పైకి తీసుకువెళ్లడానికి ప్రయత్నించింది.

వంటిల్లుగుమ్మం తెరిచేడు...ఎదురుగా...... జీవంతో...రాజి...చుట్టూరా మండుతున్న పెంకలు.

ఒక్కసారి రాజుకు ఆ క్షణంలో హృదయం నులుముకుంది. కమ్మెచ్చులో పడ్డట్టే బాధపడ్డాడు... రాజి...తన చెల్లెలే...తను చేసిన అపచారం ఎదురుగా తాండవించింది. తన సోదరికి తనే...అన్నీను... చేసి...వెర్రి పగల్లో...తను సాత్వీకంగా నడిచివుంటే...

"అన్నయ్యా!"

"రాజీ!"

ఒకళ్ల కౌగిట్లో ఒకళ్లు స్మృతే తప్పేరు. ఆ క్షణికంలో స్వర్గమే...చెవిదగ్గర... "రాజీ!... రాజీ" అని రాజాహృదయం గోలెట్టింది.

"మనం దేవతలంకాదూ అన్నయ్యా!"

"అవును రాజీ!"

అంతే...అగ్నిదేవుడు తన తేజస్సులోనే కలుపుకున్నాడు. అందులో బాధ లేదేమో! ఆవేదన, పగ కనుపించలేదేమో! పూర్ణసౌఖ్యం...స్వర్గం...

ఆఖరుకు మృత్యువైనా వాళ్లని విడతీయలేకపోయింది...

* * *

కాలం జరుగుతోంది...

